Email : telanganaveenaofficial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

epaper.telanganaveena.com | సంపుటి :1 | సంచిక: 366 | హైదరాబాద్ | శుక్రవారం | 20 -09 - 2024 | పేజీలు: 8 | రూ.3/-




## స్కిల్ వర్సిటీ నిర్వహణకు వంద కోట్లు



**● కార్పస్‌ఫండ్ ఏర్పాటుకు ముందుకు రావాలి ● బోర్డుతో సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి**

**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్19:** తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీ నిర్వహణకు ప్రభుత్వం తరపున రూ.100కోట్లు కేటాయిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. యూనివర్శిటీ పూర్తిస్థాయి నిర్వహణకు కార్పస్‌ఫండ్ ఏర్పాటుకు ముందుకు రావాలని సీఎం కోరారు. సచివాలయంలో తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీ బోర్డుతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, యూనివర్శిటీ బోర్డు ఛైర్మన్ ఆనంద్ మహీంద్ర, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితోపాటు వివిధ రంగాల పారిశ్రామిక వేత్తలు ఉన్నతాధికారులు హాజరయ్యారు. యూనివర్శిటీ నిర్వహ ణకు ఎవరికి తోచింది వారు వివిధ రూపాలలో సహకారం అందిం చాలని సీఎం కోరారు. ఈ ఏడాది నుంచే స్కిల్ యూనివర్శిటీలో ప్రారంభించే పలు కోర్సులతోపాటు కీలక అంశాలను అధికారులు పారిశ్రామిక వేత్తలకు వివరించారు. తెలంగాణ నుంచి నైపుణ్యం కలిగిన యువతను ప్రపంచానికి అందించాలన్న సీఎం ఆలోచన గొప్పదని ఆనంద్ మహీంద్రా కొనియాడారు. మంచి విజన్ ఉన్న నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి అంటూ ప్రశంసించారు. అందుకే యూనివర్సిటీ బోర్డు ఛైర్మన్‌గా ఉండాలని ఆయన కోరగానే అంగీకరించినట్టు ఆనంద్ మహీంద్రా తెలిపారు.




## 21న సీఎంగా అతీశీ ప్రమాణస్వీకారం

**తెలంగాణ వీణ/ఢిలీ, సెప్టెంబర్ 19:** ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా ఆతిశీ ప్రమాణస్వీకారానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 21న ఆమె సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆతిశీతో పాటు మంత్రులు కూడా అదే రోజు ప్రమాణం చేస్తారని ఆప్ తెలిపింది.కాగా మంగళవారం అరవింద్ కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేశారు. తదుపరి ముఖ్యమంత్రిగా ఆతిశీని ప్రకటించారు.

## కాంగ్రెస్-ఎన్సీ మేనిఫెస్టో చూసి పాక్ సంబరాలు

**- ఆర్టికల్ 370పై తేల్చేసిన మోడీ**



**తెలంగాణ వీణ/జమ్మూకాశ్మీర్, సెప్టెంబర్ 19:** జమ్మూకాశ్మీర్‌లో పాకిస్థాన్ అజెండాను ఎట్టి పరిస్థితిల్లోనూ అమలు కానివ్వబోమన్నారు ప్రధాని నరేంద్ర మోడీ. గురువారం రెండో విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. జమ్మూకాశ్మీర్ ఎన్నికలకు కాంగ్రెస్-నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీల మేనిఫెస్టో చూసి పాకిస్థాన్ సంబరాలు చేసుకుటోందని అన్నారు.ప్రజాస్వామ్యంపై జమ్మూకాశ్మీర్ యువతకు విశ్వాసం ఏర్పడిందని, వారి ఓటు మార్పు తేగలదని భావిస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరిస్తామన్న హామీని బీజేపీ నిలబెట్టుకుంటుందన్నారు. జమ్మూకాశ్మీర్ యువత నిస్సహాయ స్థితిలో లేదన్నారు. మోడీ ప్రభుత్వంలో వారంతా సాధికారత సాధిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడి యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జమ్మూకాశ్మీర్ బీజేపీ భారీ ప్రకటనలు చేయటం సంతోషంగా ఉందన్నారు. నైపుణ్యాభివృద్ధిలో, ఉద్యోగాల కల్పనలో అవకత వకలకు తావులేకుండా బీజేపీ చూస్తుందని ప్రధాని మోడీ హామీ ఇచ్చారు. శ్రీనగర్‌లో ఎన్నికల ప్రచారంలో ప్రధాని.. కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీలు అనే మూడు పార్టీలు తమ సొంత ప్రయోజనాల కోసం

వివరాలు 2లో

## ప్రజాభవన్ ముట్టడిని అడ్డుకున్న పోలీసులు

● రైతులను ఎక్కడిక్కడే అరెస్ట్ చేసి తరలింపు

● ప్రభుత్వతీరును దుయ్యబట్టిన హరీష్ రావు




## మిషన్ భగీరథలో భారీ అవినీతి

**● 53 శాతం ఇండ్లకు మంచినీరు ఇవ్వలేదు**

**వాస్తవాలు ప్రజలకు తెలియజేసి ప్రతి ఇంటికి మంచినీరు ఇస్తాం : రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 19:** గత ప్రభుత్వం ఎంతో గొప్పగా ప్రచారం చేసుకున్న మిషన్ భగీరథలో భారీ అవినీతి, అక్రమాలు జరిగాయని, 46 వేల కోట్ల రూపాయల ఈ ప్రాజెక్టులో 15 వేల నుండి 20 వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు.తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మిషన్ భగీరథపై సర్వే నిర్వహించగా 53 శాతం ఇండ్లకు మంచినీరు అందడం లేదని భయంకరమైన విషయాలు వెలుగు చూసాయని వెల్లడించారు.గురువారం నాడు వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ తో కలిసి ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రాంభించారు.

వివరాలు 2లో

## ఎన్నికల కమిషనర్‌గా కుముదిని బాధ్యతలు







## రాహుల్ వదిలిన బాణాన్ని నేను




## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం

## వచ్చే నెల 2 నుంచే దసరా సెలవులు?

**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్19:** తెలంగాణలో బోనాల పండుగ తర్వాత అదే రేంజ్ లో బతుకమ్మ పండుగ జరుపుకుంటారు. తాజాగా దసరా పండుగ సమీపిస్తు న్న నేపథ్యంలో తెలంగాణ లోని విద్యాసంస్థలకు అక్టోబర్ 2, నుంచి అక్టోబర్ 14 వరకు సెలవులు రానున్నాయి. అక్టోబర్ 2 నుంచి మొత్తం 13 రోజులు పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. 15న పాఠశాలలు పునః ప్రాంరభం కానున్నాయి. అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతితో సెలవులు మొదలు కానున్నాయి. ఆ తర్వాత నుంచి బతు కమ్మ, దసరా సెలవులు ఉంటా యని విద్యాశాఖ అధికారులు తెలిపారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలలు అక్టోబర్ 1నుంచి సెలవులు ఇస్తున్నట్టు ఇప్ప టికే ప్రకటించాయి. మళ్లీ అక్టోబర్ 15వ పునః ప్రారంభం ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం కూడా అందినట్లు తెలుస్తోంది.

## కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అరెస్ట్




**తెలంగాణవీణ/హైదరాబాద్,19:** గత మూడు రోజులుగా అజ్ఞాతంలో ఉన్న డాన్స్ మాస్టర్ జానీ ని హైదరా బాద్ ఎస్ఓటీ, పోలీసులు బెంగళూరులో గురువారం రోజున ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఓ మహిళా డాన్సర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడి పరారీలో ఉన్న ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ ఈ మేరకు ఆయనను హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేసారు. కేసు నమోదైన నాటి నుంచి జానీ మాస్టర్ నెల్లూరుకు పారిపోయాడని, హైదరాబా ద్ నగరంలోనే ఓ స్నేహితు డి ఇంట్లో తలదాచుకుంటు న్నట్లుగా మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే ఆయనను వెతికేందుకు మొత్తం నాలుగు బృందాలు రంగంలోకి దిగాయి. అలాంటి వార్తలకు చెక్ పెడుతూ గురువారంరోజున సైబరాబాద్ పోలీసులు జానీ మాస్టర్‌ను బెంగళూరులో అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఇప్పటికే ఇలాంటి ఆరోపణలతోనే ఆయన గతంలో 6 నెలల పాటు జైలు జీవితం కూడా గడిపినట్లుగా తెలుస్తోంది.

## దసరాకు రైతు భరోసా డబ్బులు

**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్19:** తెలంగాణ రాష్ట్ర రైతులకు అదిరిపోయే శుభవార్త అందింది. దసరా లోపు రైతు భరోసా నిధులు రిలీజ్ చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సన్నాహాలు.. చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈనెల 20వ తేదీన రాష్ట్ర కేబినెట్ సమావేశం ఉంది. ఈ సమావేశంలో రైతు భరోసా నిధుల పైన ఓ కీలక నిర్ణయం తీసుకోనుంది రేవంత్ రెడ్డి ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన రైతు భరోసా నిధులను రిలీజ్ చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఎకరానికి 15వేల రూపాయల చొప్పున ఏడాది మొత్తంలో రైతుల ఖాతాలో జమ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో చెప్పింది. ఆ డబ్బులను దసరా లోపు వెయ్యాలని అనుకుంటుంది. ప్రస్తుత లెక్కల ప్రకారం 1.53 కోట్ల ఎకరాలకు 11475 కోట్లు ఖర్చు అవుతుందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం అంచనా వేసింది. ఇక తెలంగాణ కేబినెట్ సమావేశంలో ఈ డబ్బులు రిపీట్ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

## దానం వ్యాఖ్యలపై మహిళా మోర్చా ఆగ్రహం

**తెలంగాణ వీణ/హైదరాబాద్,19:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై భాజపా మహిళా మోర్చా నేతలు రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. బాలీవుడ్ నటి కంగనపై దానం అనుచిత వ్యాఖ్యలు చేశారని కమిషన్ ఛైర్మన్ శారదను కలిసి వివరించారు. దానంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. మరో వైపు దానం వ్యాఖ్యలను భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. సినీనటి కంగనాపై దానం దిగజారేలా మాట్లాడటం సరికాదన్నారు. సోనియా గాంధీపై అస్సాం సీఎం అసభ్యంగా మాట్లాడితే కేసీఆర్ ఖండించారని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్‌లో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పాలని సూచించారు.

## హైడ్రాకు చట్టబద్ధత కల్పించాలి: ఈటెల

**తెలంగాణ వీణ/జనగామ,సెప్టెంబర్19:** హైడ్రాకు ఎలాంటి చట్టబద్ధత లేదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేబినెట్‌లో చర్చించి హైడ్రాకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. జనగామలో గురువారం ఈటల రాజేందర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో కుమ్ములాటలు భయటపడకుండా హైడ్రా పేరుతో డైవర్షన్ చేస్తున్నారని విమర్శలు చేశారు. పేదల భూములు రేవంత్ జాగీర్ కాదని హెచ్చరించారు. చెరువులు, వాగుల రక్షణకు భూసేకరణ చేయాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.



# ప్రజాభవన్ ముట్టడిని అడ్డుకున్న పోలీసులు

**- రైతులను ఎక్కడిక్కడే అరెస్ట్ చేసి తరలింపు**
**- ప్రభుత్వతీరును దుయ్యబట్టిన హరీష్ రావు**



**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్19:** రుణమాఫీ కోరుతూ పలువురు రైతులు ప్రజాభవన్ ముట్టడికి చేసిన యత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఎక్కడిక్కడ వారిని అరెస్ట్ చేశారు. జిల్లాల నుంచి కొందరు వచ్చేందుకు ప్రయత్నించగా వారిని కూడా అరెస్ట్ చేసి తరలించారు. అయితే దీనిని బిఆర్ఎస్ ఖండించింది. రుణమాఫీ కాలేదన్న ఆవేదనతో రైతులందరూ సంఘటితమై ఛలో ప్రజా భవన్‌కు పిలుపునిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి వణుకుపుట్టిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులను, రైతు సంఘాల నాయకులను ఎక్కడిక్కడ పోలీసు స్టేషన్లలో నిర్బంధిస్తూ వారిపై కక్ష తీర్చుకుంటున్నదని మండిపడ్డారు. రుణమాఫీ కోసం పోరుబాట పట్టిన రైతన్నలను అరెస్టులు చేయడం దుర్మార్గమైన చర్య. బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాం. అరెస్టులు చేసిన రైతులను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు. మాది ఆంక్షలు లేని ప్రభుత్వం, కంచెలు లేని ప్రభుత్వం, ప్రజా పాలన అంటూ డబ్బా కొట్టుకునే రేవంత్ రెడ్డి ఇదేంది..? ప్రజా భవన్ చుట్టూ ఎందుకు ఇన్ని బారికేడ్లు..? ఎందుకు ఇన్ని ఆంక్షలు..? ప్రజాభవన్‌కు రైతులు తరలివస్తున్నారంటే సీఎంకు ఎందుకు అంత భయం..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా మొదలైన రైతుల ఉద్యమాన్ని ఎదుర్కోవడం అంటే.. రాజకీయంగా వెకిలి మకిలి, చిల్లర వ్యాఖ్యలు చేసినంత సులువు కాదని హరీశ్‌రావు పేర్కొన్నారు. రుణమాఫీ ఏమైందని నిలదీసేందుకు వస్తున్న రైతులకు ఏమని సమాధానం చెబుతావు..? రేవంత్ రెడ్డి.. రైతులందరికి 2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి, మాట తప్పావు. ఇప్పుడది నీకు, నీ ప్రభుత్వానికి ఉరితాడు కాబోతున్నది. రుణమాఫీ చేసి తీరేదాకా, నిన్ను బీఆర్ఎస్ పార్టీ వదిలిపెట్టదు, తెలంగాణ రైతాంగం వదిలిపెట్టదు. రైతు ఏడ్చిన రాజ్యం.. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం.. చరిత్రలో ఏనాడూ బాగుపడలేదు అని హరీశ్‌రావు గుర్తు చేశారు.

## మిషన్ భగీరథలో భారీ అవినీతి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మిషన్ భగీరథ కార్యక్రమాన్ని ప్రజలకోసం చేసినట్టుగా లేదని, వారి జేబులు నింపుకోవడానికి చేసినట్టుగా ఉందని విమర్శించారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేసి ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి మంచినీరు అందిస్తామని ప్రకటించారు. గత పదేండ్లలో ఎన్నడూ లేని విధంగా వ్యవసాయానికి బడ్జెట్ లో రూ. 72 వేల కోట్లు కేటాయించిన ఘనత ఈ ప్రభుత్వానిది. 27 రోజుల్లో 23 లక్షల మందికి రూ. 18 వేల కోట్ల రైతు రుణాలను రద్దు చేశామని సాంకేతిక కారణాలతో కొంతమంది రైతులకు రుణమాఫీ ప్రయోజనం అందలేదని వీలైనంత త్వరలో వాటిని పరిష్కరించి ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి రైతన్నకు రుణమాఫీ చేస్తామని, అన్న మాట ప్రకారం 31 వేల కోట్ల రూపాయలకి ఇంకా కావాలంటే రెండు మూడు వందల కోట్లు ఎక్కువైనా పర్వాలేదు అర్హులైన ప్రతి రైతన్నకి ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో రెండు లక్షల రూపాయలు వరకు రుణమాఫీ చేసి తీరుతుంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ హెల్త్ కార్డులు, రేషన్ కార్డులు వేరు వేరుగా అందించబోతున్నామని ప్రకటించారు. మరి కొద్ది రోజుల్లో ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు వేయబోతున్నామని ప్రకటించారు. ఈ ప్రభుత్వం విద్యా వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని వెల్లడించారు. ప్రాజెక్టుల పేరుతో మిషన్ భగీరథ పేరుతో వేల కోట్ల రూపాయలను కాజేసిన గత ప్రభుత్వ పెద్దలు తమ తప్పులు కప్పి పుచ్చుకోవడానికి ప్రతి దానిని రాద్ధాంతం చేయడం అలవాటు చేసుకున్నారని దుయ్యబట్టారు. వారి పాలనలో అవినీతి అక్రమాలు జరిగినట్టుగానే ఇప్పుడు కూడా జరుగుతున్నాయనే భ్రమలో బీఆర్ఎస్ నాయకులు జీవిస్తున్నారని ఎద్దేవా విమర్శించారు.

## కాంగ్రెస్-ఎన్సీ మేనిఫెస్టో చూసి పాక్ సంబరాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. వారి స్వార్థం కారణంగా కాశ్మీరీ ప్రజలకు పెను నష్టం వాటిల్లిందన్నారు. 1980ల్లో ఏం జరిగిందో మర్చిపోయారా? ఆ మూడు పార్టీలు (కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ) జమ్మూకశ్మీర్‌ను వారి సొంత సామ్రాజ్యంగా భావించాయి. ఆ మూడు కుటుంబాలవారు (గాంధీ, ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లా కుటుంబం) కాకుండా ఇంకెవర్నీ రాజకీయాల్లోకి రానిచ్చేవారు కాదు. విద్యకు దూరమైన మన యువత చేతిలో వారు రాళ్లు పెట్టారు. వారి స్వప్రయోజనాల కోసం మన పిల్లల భవిష్యత్తు నాశనం చేస్తున్నారు. జమ్మూకాశ్మీర్‌పై కుట్రలు చేసే ప్రతి శక్తినీ ఓడించి తీరుతామని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. కాంగ్రెస్, ఎన్సీల మేనిఫెస్టోకు పాకిస్థాన్ రక్షణ మంత్రి మద్దతు తెలిపారని.. ఆ పార్టీలు పాకిస్థాన్ అజెండాను అమలు చేస్తున్నాయంటూ ప్రధాని మోడీ మండిపడ్డారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత వేర్పాటువాదం, ఉగ్రవాదం క్షీణించాయని.. వాటిని ఇంకా పూర్తిగా నిర్మూలిస్తామన్నారు. ఈ భూమ్మీద ఏ శక్తీ ఆర్టికల్ 370ని వెనక్కి తీసుకురాలేదని తేల్చిచెప్పారు.

## ఎన్నికల కమిషనర్‌గా కుముదిని బాధ్యతలు



**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్19:** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నియమితులైన ఐఏఎస్ అధికారి రాణి కుముదిని బాధ్యతలు స్వీకరించారు. 1988 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన రాణి కుముదిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ హోదాల్లో పనిచేసి గత జులైలో పదవీ విరమణ పొందారు. రాణి కుముదిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రెండ్రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో ఎస్ఈసీగా ఆమె బాధ్యతలు చేపట్టారు. మూడేళ్లపాటు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా కొనసాగనున్నారు.

# రాహుల్ వదిలిన బాణాన్ని నేను

**- అధిష్టానం కోరుకున్నట్లుగా పనిచేస్తా...: పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

**తెలంగాణ వీణ/హైదరాబాద్,19:** వెనుకబడిన వర్గాల విషయంలో ఎక్కడా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. తన కార్యవర్గంలో 60శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అవకాశం కల్పిస్తానన్నారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు హనుమంతరావు ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఘనంగా సత్కరించారు. పలువురు మంత్రులు, ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలు, కమిషన్ ఛైర్మన్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ... బీసీల కులగణన గురించి భాజపా, భారాస చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. ఆ రెండు పార్టీలకు బీసీల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. తాను రాహుల్ గాంధీ వదలిన బాణాన్నని చెప్పిన ఆయన.. అధిష్ఠానం కోరుకున్నట్లుగా నడచుకుంటానని స్పష్టం చేశారు. సెక్రటేరియేట్ ఎదుట ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని కేటీఆర్ అంటున్నారని, ఇక భారాస అధికారంలోకి రావడం కలేనని ఎద్దేవా చేశారు. గత పదేళ్ల పాలనలో తెలంగాణ తల్లి ఎందుకు గుర్తు రాలేదని నిలదీశారు. బడుగు బలహీన వర్గాల మద్దతుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్న ఆయన.. వారందర్నీ గుండెల్లో పెట్టుకొని వారి కలలను నిజం చేస్తూ ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. కులాలను పక్కన పెట్టి, బీసీలంతా ఐక్యంగా ముందుకు కదలాలని పిలుపునిచ్చారు.




## మునిసిపాలిటీల్లో హైడ్రా లాంటి వ్యవస్థ తేవాలి

**- మెదక్ ఎంపీ రఘునందన్ రావు**

**తెలంగాణ వీణ/సంగారెడ్డి,సెప్టెంబర్19:** అన్ని మునిసిపాలిటీల్లో హైడ్రా లాంటి వ్యవస్థ తేవాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. ఆమీన్ పూర్‌లో ప్రైవేట్ సర్వే నెంబర్ వేసి ప్రభుత్వ భూమిలో అపార్ట్‌మెంట్ కట్టారని చెప్పారు. రెవెన్యూ అధికారులు అపార్ట్ మెంట్‌లో ఉంటున్న వారికి నోటీసులు ఇచ్చారని గుర్తుచేశారు. అమాయకులు ఎంతో మంది ఇలా నష్టపోతున్నారని చెప్పారు. ఇవాళ(గురువారం) సంగారెడ్డిలో పర్యటించారు. ఈ సందరన్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ... బీఆర్ఎస్ హయాంలో పదేళ్లలో ఆస్పత్రుల్లో ఎన్నో మరణాలు సంభవించాయని ఆరోపణలు చేశారు. తెలంగాణలో అధికారం కోల్పోయామనే బాధలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ అర్ధరహితమైన .మాటలు మాట్లాడుతున్నారని విమర్శలు చేశారు. ఒక సంఘటనను చూపించి.. కొత్తగా వచ్చిన ప్రభుత్వంలో ఏదో మార్పు జరగాలని కోరడం ఏంటని ప్రశ్నించారు. తాను కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా మాట్లాడటం లేదని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో ఏం చేయలేని అసమర్థులని విమర్శించారు. కేసీఆర్ హయాంలో ఆస్పత్రులను అద్భుతంగా చేసుంటే .. ఆ డాక్టర్లకు కల్పించాల్సిన సౌకర్యాలు ఏమయ్యాయని నిలదీశారు. గాంధీలో ఎంతమంది చనిపోయారో బీఆర్ఎస్ హయం నుంచి ఇప్పటివరకు లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయాల కోసం విమర్శించడం సరికాదని అన్నారు. రైతు ఆత్మహత్యలు బీఆర్ఎస్ హయాంలో జరిగాయి.. ఇప్పుడు జరుగుతున్నాయని చెప్పారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులు ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నారని ఎంపీ రఘునందన్ రావు అన్నారు.

# ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం

**- వచ్చే నెలాఖరులోగా ప్రారంబించాలి**
**- అధికారులకు సిఎస్ శాంతికుమారి ఆదేశం**

**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్19:** కొడంగల్, మధిర నియోజకవర్గం, లక్ష్మీపురం గ్రామంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనులను వచ్చే నెలాఖరులోగా ప్రారంబించాలని అధికారులను సిఎస్ శాంతికుమారి ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పర్యవేక్షణ కోసం ఏర్పాటైన మేనేజ్‌మెంట్ కమిటీ మొదటి సమావేశం జరిగింది. సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కొడంగల్, మధిర నియోజకవర్గం, లక్ష్మీపురం గ్రామంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనులను వచ్చే నెలాఖరులోగా ప్రారంబించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పరిపాలనా అనుమతుల కోసం ప్రతిపాదనలు సమర్పించేందుకు అనుసరించాల్సిన విధానాలు, ప్రతిపాదనల పక్రియకు నోడల్ విభాగం ఖరారుపై చర్చించారు. సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణ, రెసిడెన్షియల్ పాఠశాలలకు భూములు కేటాయించడంపై సమావేశంలో చర్చించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రతివారం సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస్‌రాజు, ముఖ్య కార్యదర్శులు నవీన్ మిట్టల్, బి వెంకటేశం, సందీప్ కుమార్ సుల్తానియా, శ్రీధర్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్, ఇతర ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.



తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి 8328209811

# మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గల్ఫ్ జెఏసి సన్మానం



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం జీఓ విడుదల చేయడానికి చొరవ తీసుకున్న బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు గల్ఫ్ జెఏసి బృందం గురువారం సచివాలయంలో మంత్రి చాంబర్ లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, టీపీసీసీ ఎన్నారై సెల్ చైర్మన్ అంబాసిడర్ డా. బిఎం వినోద్ కుమార్, ఎమిగ్రంట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షులు మంద భీంరెడ్డి, గల్ఫ్ జెఏసి నాయకులు చెన్నమనేని శ్రీనివాస రావు లు పాల్గొన్నారు.


# ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం




**తెలంగాణ వీణ/మంథని:** ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలని ఐసిటిసి కౌన్సిలర్ సత్యనందం అన్నారు. గురువారం మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం కల్పించారు. నేటి సమాజంలో ఈ వ్యాధి వ్యాపించకుండా ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపడుతుందన్నారు. విద్యార్థులకు ఈ వ్యాది గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉన్నపుడే రాకుండా నిరోధించుకునే అవకాశం ఉంటుందన్నారు. చిన్న వయస్సులోనే ఆకర్షణలో పడి బంగారు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గం అన్నారు. పెళ్లికి ముందు శృంగారంలో పాల్గొనడం ద్వారా సుఖవ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, వ్యాధి ఉన్న వాల్లతో కలసి తిన్నా, ఉన్నా సోకదన్నారు. ఈ వ్యాధిపై అనుమానాలు ఉన్నవాళ్ళు టోల్ ఫ్రీ నెంబర్ 1097 కి కాల్ చేసి తెలుసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సలీం, అధ్యాపకులు ఝాన్సీ, శ్రీధర్ రావు, తిరుమల్, తిరుపతి, నగేష్, శ్రీదేవి, ల్యాబ్ టెక్నిషియన్ సుకుమార్ పాల్గొన్నారు.

# పిఈటి, టీచర్‌ను సస్పెండ్ చేయాలంటూ రోడ్డెక్కిన విద్యార్థులు

**తెలంగాణ వీణ/రాజన్న జిల్లా:** రాజన్న సిరిసిల్ల జిల్లా లోని తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలోని గిరిజన గురుకుల పాఠశాల లో విధులు నిర్వహిస్తున్న మహిళా పీఈటీ టీచర్ తమను దూషిస్తున్నారని విద్యార్థినులు ఇటీవల ఆందోళనకు దిగారు. తమపై పీఈటీ టీచర్ చేయిచేసుకుంటున్నారని అంతే కాకుండా వీడియోలు తీస్తామని బెదిరిస్తున్నారని విద్యార్థినులు ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రిన్సిపల్‌కు చెప్పినా పట్టించుకోలేదని బాలికలు వాపోయారు.తమ సమస్య పరిష్కారం కాకపోవడంతోగురు వారం సిరిసిల్ల– సిద్దిపేట రహదారిపై విద్యార్థినులు బైఠాయించారు. పీఈటీని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. డోర్ పగలగొట్టి లోనికి వచ్చి మొబైల్ ఫోన్‌తో వీడియో రికార్డు చేస్తూ కొడుతోందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. పీఈటీ టీచర్ ను వెంటనే సస్పెండ్ చేయాలని విద్యార్థులు కోరారు.సస్పెండ్ చేసే వరకు తాము రోడ్డుపైనే ఆందోళన చేపడతామని విద్యార్థులు హెచ్చరించారు.




## ప్రస్తుతం చేపట్టే అభివృద్ధి పనులు మరో వందేళ్ళ వరకు

# మనగలిగేలా చర్యలుండాలి

- దేవాలయాల నిర్వహణలో ఆగమ శాస్త్రాలకు ఇస్తున్న ప్రాధాన్యతే, భక్తుల సౌకర్యాల కల్పనలోనూ కనబరచాలి - వేములవాడలో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించాలి - వేములవాడ దేవాలయ గంగా జమున తెహజీబ్ కు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదు - అభివృద్ధి పనుల్లో వేగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించిన మంత్రి కొండా సురేఖ - శాస్త్ర నియమాలకు అనుగుణంగా దేవాలయ విస్తరణ పనులు చేపట్టాలి - భద్రాచలం ఆలయ విస్తరణకు అవసరమైన భూసేకరణను ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో సమీకరించాలి - డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి తుమ్మల నాగేశ్వర రావులతో కలిసి భద్రాచలం దేవాలయాన్ని సందర్శించి విస్తరణ పనుల పై స్పష్టతకు వస్తామన్న మంత్రి బిపొంగులేటి



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రస్తుతం చేపట్టే పనులు మరో 100 ఏళ్ళ వరకు చెక్కుచెదరకుండా వుండే విధంగా నిర్మాణపనులు చేపట్టాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ అన్నారు. దేవాలయ నిర్వహణ విషయంలో ఆగమ శాస్త్రాలకు ఎంత ప్రాధాన్యతనిస్తున్నామో, అంతే ప్రాధాన్యతను భక్తుల సౌకర్యాల కల్పనకు ఇవ్వాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. డా. బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని దేవాదాయ ధర్మాదాయ మంత్రిత్వశాఖ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం, భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం, బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయాల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అభివృద్ధి పనుల పురోగతి పై అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, బాసర దేవాలయ ఈవో విజయ రామారావు, వేములవాడ దేవాలయ ఈవో వినోద్, భద్రాచలం ఈవో రమాదేవి, స్థపతి ఎన్. వల్లి నాయగన్, ఎస్ఈ కె. దుర్గా ప్రసాద్, సహాయ స్థపతి పి. గణేషన్, ప్రధానార్చకులు ఉమేష్, ప్రవీణ్ పాఠక్, కన్సర్వేష ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి, పలువురు అర్చకులు, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, పలు దశలుగా చేపట్టే దేవాలయ అభివృద్ధి పనులు కొనసాగింపుగా వుండేలా తప్ప మరో దశలో చేపట్టే పనులతో విభేదించకుండా సమర్థవంతంగా కార్యాచరణ అమలు చేయాలని మంత్రి సురేఖ తెలిపారు. పవర్ పాయింట్ ప్రజేషన్ ద్వారా అధికారులు మంత్రులు సురేఖ, పొన్నం ప్రభాకర్ లకు వేములవాడ దేవాలయ పురోగతి పనులను వివరించారు. వేములవాడ ఆలయ గోశాలలోని ఆవులు, కోడెల ఉచిత పంపిణీ విధివిధానాలను అధికారులు మంత్రికి వివరించారు. ప్రస్తుతమున్న ధర్మగుండాన్ని కేవలం స్వామివారి అభిషేకానికే కేటాయించి, భక్తుల సౌకర్యార్థం మరో ధర్మగుండాన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. వేములవాడ దేవాలయం పరిసరాల్లో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేలా షాపుల నిర్వహణ విషయంలో యజమానులకు కచ్చితమైన మార్గదర్శకాలను సూచించాలని అధికారులను ఆదేశించారు. గంగా జమున తెహజీబ్ ను ప్రతిబింబించే వేములవాడ దేవాలయంలోని దర్గా విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. వేములవాడ టెంపుల్ డెవలప్ మెంట్ అథారిటి నిధులతో బద్ది పోచమ్మ ఆలయ అభివృద్ధిని చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. దేవాలయ విస్తరణలో భాగంగా నిర్మిస్తున్న శివరచన వేదికలో శివరాత్రి ఉత్సవాలను నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలపగా, కార్తీక మాసం, శ్రావణ మాసం వంటి పవిత్ర మాసాల్లో, ప్రత్యేక దినాల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు సైతం చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. మొదటి దశలో నిర్ధారించుకున్న పనులను వేగవంతంగా పూర్తిచేయాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు. బాసర దేవాలయంలో ప్రస్తుతం 2 రాజగోపురాలు మాత్రమే వుండగా, వీటిని నాలుగు పెంచాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. ప్రాకారం, గోపురాలు, గర్భగుడి పనులను మొదలుపెట్టాలని స్పష్టం చేశారు. బాసరలో భక్తుల సౌకర్యార్థం అందుబాటులో వున్న సత్రాలు, వాటి పరిధిలోని గదుల పై మంత్రి సురేఖ ఆరాతీశారు. భక్తుల సౌకర్యం నిమిత్తం పార్కింగ్, మూత్రశాలలు, క్యూలైన్లు తదితర అంశాలకు సంబంధించి ఏమాత్రం ఏమరపాటు తగదని మంత్రి హెచ్చరించారు. నిర్మాణ పనులు చేసేటప్పుడు భక్తులకు ముందుగానే సమాచార సాధనాల ద్వారా సమాచారమిచ్చి అసౌకర్యాన్ని నివారించాలని మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. భద్రాచలం ఆలయ విస్తరణకు ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో భూసేకరణ పనులు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భద్రాచలం ఆలయ అభివృద్ధికి చేపడుతున్న భూసేకరణ, ఆలయ విస్తరణ పనుల పై అధికారులు మంత్రి పొంగులేటికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. శాస్త్ర నియమాలను తప్పకుండా, సహజంగా దేవాలయ విస్తరణ పనులు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులకు సూచించారు. కళ్యాణ మండపానికి అనుబంధంగా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు మరో మండపాన్ని నిర్మించాలన్నారు. దేవాలయ విస్తరణలో భాగంగా కుసుమ హరనాథ దేవాలయానికి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావులతో కలిసి దేవాలయాన్ని సందర్శించి, పరిసరాలను కలియతిరిగి కచ్చితమైన నిర్ణయానికి వస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లకు అర్చకులు వేదాశ్వీరచనం అందించారు. రానున్న దసరా పండుగను పురస్కరించుకుని బాసర జ్ఞాన సరస్వతి దేవాలయంలో నిర్వహించే 'దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు' పోస్టర్ ను మంత్రులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవాదయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు ఆవిష్కరించారు.

# బిసి కులగణనకు కట్టుబడి ఉన్నాం

- హైకోర్టు తీర్పు మేరకు నడుచుకుంటాం
- బిఆర్ఎస్ నేత కెటిఆర్ సుద్దులు అవసరం లేదు
- బిఆర్ఎస్‌లో మిగిలేది ఆ ముగ్గురే అన్న ఆది శ్రీనివాస్



**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్18:** బీసీ కుల గణనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. అసెంబ్లీలో ఇప్పటికే బీసీ కులగణన బిల్లు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. బీసీ కులగణన కోసం జీవో విడుదల చేశారని.. త్వరలోనే కులగణన జరుగుతుందని సీఎం చెప్పారన్నారు. 42శాతం రిజర్వేషన్‌కు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. బీసీ కులగణన మీద కేటీఆర్ మాకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదని అంటూ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అనేక సందర్భాల్లో ఎంత జనాభా అంత వాటా అని చెప్పారన్నారు. మేము అడిగితే చేశారని చెప్పుకునే కుటిల బుద్ధితో వ్యవహరిస్తున్నారు. పదేళ్లలో కుల గణన చేయాలనే ఆలోచన ఎందుకు మీకు రాలేదు. బీఆర్ఎస్ ప్రెసిడెంట్.. వర్కింగ్ ప్రెసిడెంట్.. అసెంబ్లీ ప్రతిపక్ష నేత పదవుల్లో బీసీలు ఎవరూ లేరు. మీలాగా తండ్రి చాటున కొడుకుగా.. మామ చాటున ల్లుడిగా రేవంత్ రెడ్డి ఎదగలేదు' అంటూ విమర్శించారు. పీసీసీ చీఫ్ పదవి బీసీలకు ఇచ్చామన్నారు. భవిష్యత్‌లో బీసీలకు మరింత అవకాశాలు కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. మీరు మాకు డెడ్ లైన్ పెట్టడం ఎంటి..? బీసీ కుల గణన చేసి తీరుతాం.. హైకోర్టు కూడా మూడు నెలలలో నివేదిక పంపాలని సూచించింది తప్పక చేస్తాం. మా పాలన చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారు. మీ పార్టీలో.. ప్రభుత్వంలో ఆ నలుగురే ఉన్నారు.. ఇప్పుడు కూడా ఆ నలుగురే మిగులుతారు. తొమ్మిది ఏళ్ల మీ విధ్వంస పాలనను గాడిన పెట్టే ప్రయత్నం చేస్తున్నాం. గల్ఫ్ కార్మికులను మీ ప్రభుత్వం పట్టించుకోలేదు. వారి కోసం మా ప్రభుత్వం జీవో తీసుకువచ్చింది. గల్ఫ్ కార్మికులు మరణిస్తే.. ఐదు లక్షల పరిహారం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. బీఆర్ఎస్ గా పేరు మార్చుకోవడంతో తెలంగాణ ప్రజలతో పేగు బంధం తెంచుకున్నారు. కేటీఆర్ సుద్దపూస మాటలు మానుకోవాలి. కేటీఆర్‌కు బీసీ కులగణన నవంబర్‌లోగా చేయకపోతే ప్రత్యక్ష పోరాటం అంటున్నారు. కేటీఆర్‌కు సవాల్ విసిరే హక్కు కూడా లేదు.. తొమ్మిది ఏళ్లు మీరు ఏం చేశారు. మేము తప్పక బీసీ కులగణన చేసి తీరుతాం. సమగ్ర కుటుంబ సర్వేతో కోడి గుడ్ల లెక్క కూడా తీశారు.. ఆ సర్వే రిపోర్ట్ బయట పెట్టకుండా ఏం చేశారు. ఆ రిపోర్ట్‌ను మీ స్వార్ధానికి ఉపయోగించుకున్నారు' అంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. జమిలీ ఎన్నికలు అనేది కేంద్ర ప్రభుత్వం ఆలోచన.. అవుతుందా లేదా అనేది చూడాలన్నారు. 2029 లో జమిలీ నిర్వహిస్తారా..? ఇతర రాష్టాల్లో పాలన పొడగిస్తారా.. ఇలా అనేక సమస్యలు ఉన్నాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ చిట్టి నాయుడు అంటున్నారని. మరి ఆ బాబు సహకారం లేనిది కేసీఆర్ ఎక్కడ ఉండేవారని ప్రశ్నించారు. వాళ్ళ మెప్పు కోసం కేటీఆర్‌కు ఆ పేరు పెట్టారని.. కేటీఆర్‌ను బాబు చిట్టి అని పిలువాలి అంటూ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యలు చేశారు.

# గణనాథుని కృప వల్ల రాష్ట్రం సుభిక్షంగా ఉంది

**- ముత్తయిదువులచే కుంకుమ పూజ అభినందనీయం - కళాకారులను ప్రోత్సహించడం హర్షనీయం**
**- మల్కాజ్ గిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్ ...పట్నం సునీత మహేందర్ రెడ్డి**








**తెలంగాణవీణ/కూకట్ పల్లి:** గణనాథుని కృపతో రాష్ట్రంలో, అన్ని వర్గాలు సుభిక్షంగా ఉండాలని మల్కాజ్ గిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్ పట్నం సునీత మహేందర్ రెడ్డి అన్నారు. ఆశయాలు అతిపెద్ద కాలనీలో పేరొందిన కూకట్ పల్లి టెంపుల్ బస్ స్టాప్ లో కే.పీ.హెచ్.బి. కాలని కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన, వినాయక మండపం వద్ద నిర్వహించిన కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, సతీమణి.శేరి మమతా ఆధ్వర్యంలో, ముత్తయిదువలచే కుంకుమ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పట్నం సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, గణనాథుని కృపా కటాక్షాలతో తెలంగాణ రాష్ట్రంలో కురిసిన వర్షాలకు ఎక్కువ నష్టం జరగ కుండా బయటపడగలిగామన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా, కెపిహెచ్బి కాలనీ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద, సనాతన ధర్మాన్ని పెంపొందించే విధంగా మన సాంస్కృతిని గౌరవించే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి, ఔత్సాహిక కళాకారులో నెలకొన్న సృజనాత్మకతను వెలికితీయడం అభినందనీయమన్నారు. సంస్కృతిని పెంపొందిస్తూనే కళాకారులను ప్రోత్సహించడం ద్వారా మంచిని పెంపొందించడం హర్షించదగ్గ పరిణామం అని అన్నారు. గణనాథుని దర్శించుకుని కుంకుమ పూజలు పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బి సంజీవ్ రావు,అరవింద్ రెడ్డి, మేకల మైకల్, రేష్మ, రజిత, జోజమ్మ, దేవ సహాయం రవి, లక్ష్మీనారాయణ,అబ్దుల్ బాకీ, గోవింద గౌడ్, కమిటీ సభ్యులు రాజేష్ గౌడ్,లుంగీ రాజు, రాజు ముదిరాజ్, పిడికిలి గోపాల్ చౌదరి, రామకృష్ణ రెడ్డి, లక్ష్మీ, ఆర్ కె, సుభాష్లు పాల్గొన్నారు.

# తెలంగాణలో స్టాఫ్ నర్సుల నియమానికి నోటిఫికేషన్?



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణలోని నిరుద్యోగు ల కొరకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన జాబ్ కేలండర్ ప్రకారం ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న 2050 స్టాఫ్ నర్సుల ఉద్యోగాల భర్తీకి నోటీఫికేషన్ విడుదల చేసింది.ఈ నోటీఫికేషన్లో భాగంగా రాష్ట్ర కుటుంబ సంక్షేమం, మెడికల్ డైరెక్టర్ విద్యలో 1576 పోస్టులు, తెలంగాణ వైద్య విధాన పరిషత్లో 332 పోస్టులు, ఆయూష్లో 61, ఇనిస్ట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ లో 1, ఎంఎన్జే ఇనిస్ట్యూట్ ఆఫ్ అంకాలజీ, రీజినల్ క్యాన్స ర్ కేంద్రంలో 80 పోస్టులతో మొత్తం 2050 ఖాళీలను భర్తీ చేయనున్నారు.అదే సమయంలో రానున్న రోజుల్లో ఖాళీలు మరిన్ని పెరిగితే వాటిని జోడించడం లేదా తగ్గిస్తామని నోటీఫికే షన్లో పేర్కొన్నారు. ఈ పోస్టుల భర్తీకి సంబంధిం చిన దరఖాస్తుల స్వీకరణ ఆన్లైన్ లో 28.9.2024 నుండి ప్రారంభంకానుంది. ఆన్లైన్లో దరఖాస్తు సమర్పించేందుకు అక్టోబరు 14 సాయంత్రం 5 గంటల వరకు సమయం ఇచ్చారు. దరఖాస్తు దారులు తమ దరఖాస్తులను ఎడిట్ చేసుకునేందుకు అక్టోబరు 16న ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 వరకు సమయం ఇచ్చారు. ఖాళీల భర్తీకి నవంబరు 17న కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ సీబీటీ, విధానంలో పరీక్షను నిర్వహించనున్నారు. 100 పాయింట్ల ప్రాతిపదికన రిక్రూట్ మెంట్ డ్రైవ్ను చేపడతామని వెల్లడించారు.ఇందులో 80 పాయింట్లు రాత పరీక్షలో పొందాలని, మరో 20 మార్కుల వెయిటీజీ రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కార్యక్రమాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ సిబ్బందికి ఇస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఆరు నెలలుగా పనిచేస్తుంటే 2.5 పాయింట్లు ఇవ్వనున్నట్లు నోటీఫికేషన్లో పేర్కొన్నారు.

# పోషణ మాసం- పరిశుభ్రతపై అవగాహన...



**తెలంగాణ వీణ/జగిత్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 19:** జగిత్యాల ప్రాజెక్టు రాయికల్ మున్సిపల్ పరిధిలో సిడిపిఓ మమతా , రాయికల్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గండ్ర రమాదేవి ఆధ్వర్యంలో, పొలస సెక్టార్ లోని అంగన్వాడి కేంద్రాలలో సుపర్ వైజర్ రాజా శ్రీ , సారంగాపూర్ మండలంలోని రేచపెల్లి సెక్టార్ మేడారం తండా , నాయకపు తాండా లలో సూపర్ వైజర్ శైలజ అధ్యక్షతన పోషణ మాసం లో భాగంగా పరిశుభ్రత పై అవగాహన సదస్సు లు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం అన్నప్రాసన ,అక్షరాభ్యాసం మరియు చేతులు కడుక్కోవడం మరియు పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం పోషణ మాసం ప్రతిజ్ఞ కార్యక్రమం చేయించడం జరిగింది . ఈ సందర్భంగా ఐ సి డి ఎస్ సి డి పి ఓ ,సుపర్వైజర్లు మాట్లాడుతూ గ్రామంలో తక్కువ ఖర్చుతో స్థానికంగా లభించే ఆకుకూరలు ,కూరగాయలు, సీజనల్గా లభించే పండ్లు ,చిరుధాన్యాలు వంటి పోషకాహారాన్ని నిత్యం ఆహారంలో తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచుకోవడంతో పాటు రక్తహీనతను నివారించటంతో పాటు అనారోగ్యానికి దూరంగా ఉండవచ్చునని తెలిపారు ,ముర్రు పాలు , తల్లిపాల ద్వారా బిడ్డకు తల్లికి కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు . బిడ్డకు పుట్టిన గంటలోపు నుండి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని ఆరు నెలలు నిండిన తర్వాత ఏడవ నెల నుంచి ఇంట్లో తయారు చేసిన పోషకాహారాన్ని అనుబంధ ఆహారంగా తినిపిస్తూ ,అంగన్వాడీ కేంద్రం నుంచి అందించే కోడి గ్రుడ్లు , బాలామృతం తో పిల్లలకు నచ్చిన విధంగా వివిధ రకాల ఆహార పదార్థాలు తయారు చేస్తూ పిల్లలకి తినిపించాలని, రెండు సంవత్సరాల వరకు కూడా బిడ్డకు తల్లిపాలు కొనసాగించాలని, ప్రతి నెల అంగన్వాడీ కేంద్రానికి తీసుకుని వచ్చి పిల్లల ఎత్తు ,బరువులను నమోదు చేయించాలని ,ఎత్తుకు తగ్గ బరువులో సామ్ , మామ్ లో ఉన్న పిల్లలందరికీ అంగన్వాడీ కేంద్రం నుంచి అందించే బాలామృతం ప్లస్ తప్పనిసరిగా తినిపించాలని, తల్లులందరికీ శానిటేషన్ పట్ల పూర్తి అవగాహన కల్పించడంతోపాటు సీజనల్గా వచ్చే వ్యాధులు మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల కూడా అవగాహన కల్పించారు. ప్రీస్కూల్ న్యూ కరికలం ప్రీస్కూల్ పిల్లలతో ఆటలు పాటలు కథలు స్టేజ్ పై ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో రాయికల్ ఎమ్మార్వో ఖయ్యూబ్ , మెడికల్ ఆఫీసర్ సతీష్ , కౌన్సిలర్ శ్రీధర్ , అనురాధ , సూపర్వైజర్ పద్మావతి ,లావణ్య మేడం , హెల్త్ సూపర్వైజర్స్ ఏ ఎన్ ఎం లు , అశాలు, గర్భిణీలు, బాలింతలు, పిల్లల తల్లులు, అంగన్వాడీ టీచర్స్ , హెల్పర్స్ ,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి యువమోర్చ అధ్వర్యంలో రక్తదానం

**తెలంగాణ వీణ/హనుమకొండ ప్రతినిది, సెప్టెంబర్ 19:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవ పక్షం( సేవ పక్వాడ) కార్యక్రమంలో భాగంగా గురువారం బిజెపి హనుమకొండ జిల్లా యువ మోర్చ అధ్యక్షులు తీగల భరత్ గౌడ్ ఆధ్వర్యంలో బిజెపి హనుమకొండ జిల్లా కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి నాయకులు, కార్యకర్తలు రెడ్ క్రాస్ సొసైటీ వారికి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు డా పేసరు విజయ్ చందర్ రెడ్డి,జిల్లా నాయకులు కొలను సంతోష్ రెడ్డి, దేశినీ సదానందం గౌడ్, గురిజాల శ్రీరాం రెడ్డి, ముత్యాల శ్రీనివాస్, నార్మెట్ట శ్రీనివాస్ రావు, రత్నా లక్ష్మి, చల్లా జైపాల్ రెడ్డి, కడవేరు శ్రీనివాస్, కురిమిండ్ల సది, కళ్యాణ్, అరణ్య రెడ్డి, శ్రీరాం రెడ్డి, శ్రీనివాస్ రావు, శివ కళ్యాణ్, తిరుపతి రెడ్డి, యువ మోర్చ నాయకులు హరీష్, శివ, రాము గౌడ్, సుమంత్, రాహుల్, అభిషేక్, అనిల్, అజయ్, ఉష రాణి, తదితరులు పాల్గొన్నారు.







## తక్షణమే దోబీ ఘాట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

**- జోనల్ కమిషనర్ రవి కిరణ్కు వినతి**
**- రజక సంఘం అధ్యక్షుడు పాండు కార్యదర్శి కాసర్ల నాగరాజు**




**తెలంగాణ వీణ/మల్కాజ్గిరి:** మల్కాజ్గిరిలోని గౌతమ్ నగర్ డివిజన్లో ఉన్న జ్యోతి నగర్ దోబి ఘాట్ రజక సంఘం చేపట్టిన తీవ్ర ఆందోళన ప్రతిపాదన ఉత్తరం మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి జోనల్ కమిషనర్ రవి కిరణ్, రాయడం జరిగింది .జ్యోతి నగర్ లోని దోబీ ఘాట్ తక్షణ అవసరాన్ని కమీషనర్ కు వినతి పత్రం అందజేశారు. మల్కాజ్గిరి లో సరైన వాషింగ్ ప్రాంతాలు లేవు ప్రస్తుతం ఉన్న వాషింగ్ ప్రాంతాలు సరిపోవు రజక వృత్తిని జీవనోపాధిగా చేసుకుని జీవిస్తున్న రజక కుటుంబాలకు 1985లో జ్యోతి నగర్ ధోబి ఘాట్ ను ప్రభుత్వం వారే నిర్మించడం జరిగింది కొన్ని సంవత్సరాల తర్వాత అది శిథిలవస్థకు చేరుకోవడం జరిగింది అని ఆ స్థలంలో తిరిగి మరల దోబీ ఘాట్ నిర్మించి ఇవ్వాలని పవర్ బోరు ఏర్పాటు చేయాలని మహిళలకు సౌకర్యార్థం బాత్రూంలు ఏర్పాటు చేయాలని పేద రజకులను ఆదుకోవాలని ఎమ్మెల్యే కోరారు పై విషయమై జోనల్ కమిషనర్ స్పందిస్తూ తక్షణమే దోబీ ఘాట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని సానుకూలంగా స్పందించారు ఇట్టి ఉత్తరాన్ని రజక సంఘం అధ్యక్షుడు పి. పాండు కార్యదర్శి కాసర్ల నాగరాజు పి. సత్యనారాయణ ఎల్. సురేష్ తదితరులు కమిషనర్ గారికి అందించారు.

## వైభవంగా వినాయక నిమజ్జనం



**తెలంగాణ వీణ/నాచారం:**విఘ్నేశ్వరుని రథానికి కాలనీ మహిళలు మహా హారతి ఇచ్చి వైభవంగా ఊరేగించారు. గణేష్ నిమజ్జన ఉత్సవంలో చిన్నారులు సందడిచేస్తు డ్యాన్స్ ఆడుతూ జై బోలో గణేష్ మహా రాజ్ కి జై అంటూ నామస్మరణ చేశారు. శ్రీ వినాయక చిల్డ్రన్స్ యూత్ అసోసియేషన్ వారు భక్తి శ్రద్ధలతో గణపతి బప్పా మోరియా అంటూ మారుమోగిన నాచారం అన్నపూర్ణ కాలనీ.. డీజే సౌండ్ బ్యాండు మేళలతో చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అందరూ కలిసి నాచారం అన్నపూర్ణ కాలనీ నుండి వినాయక రథ ఊరేగింపు ముందుకు సాగి రాంపల్లి చెరువులో విఘ్నేశ్వరునికి మహా హారతి ఇచ్చి వైభవంగా నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో విజయ్, హర్ష్, సన్నీ, వంశీ నాయక్, భరత్, సాయి రోహన్, జాషు., కౌశిక్, అక్షయ్, వంశీ, అనిల్ వివేక్, రవి, టైసన్, ప్రవీణ్, అభి, శంకర్, భువన్, రాకీడ్,రాకీ, రాకీ, టిరత్నకుమారి, జ్యోతి,వినోద,ప్రేమీల. రేణుక తదితరులు పాల్గొన్నారు.

## పిసిసి అధ్యక్షున్ని కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** హైదారాబాద్ లోని గాంధీ భవన్ లో గురువారం నిజామాబాద్కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు పిసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ను కలిశారు.ఆయనను కలిసిన వారిలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ ఆకుల రాజేశ్వర్.మాజీ కార్పొరేటర్ రాజేంద్ర ప్రసాద్. కాంగ్రెస్ నాయకులు అభిమానులు పలువురు విద్యార్థులు గ్రూప్ 4 ఉద్యోగ నియామకాల విషయంలో ఎదుర్కుంటున్న సమస్యలను ఆయనకు వివరించారు.ఆనేక మంది తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. వాటిని పరిష్కరించేందుకు అధికారులతో మాట్లాడుతామని మహేష్ కుమార్ గౌడ్ వారికి హామీ ఇచ్చారు.అనంతరం ప్రముఖులు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.



# మానికేశ్వరి నగర్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో

# డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్..

**తెలంగాణ వీణ/తార్నాక:** ఈరోజు గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతే శ్రీలత శోభన్ రెడ్డి, తెలంగాణ ట్రేడ్ యూనియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మోతే శోభన్ రెడ్డి కలిసి మనికేశ్వర్ నగర్ లో ఇఫ్లు యూనివర్సిటీ నిర్వహించిన "స్వచ్ఛతా హీ సేవా" కార్యక్రమంలో పాల్గొన్నారు."స్వచ్ఛతా హీ సేవా" ఉద్యమం ప్రధానంగా ప్రజల్లో శుభ్రతపై అవగాహన కల్పించి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్రను గుర్తు చేస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా పౌరులందరికీ తమ చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచడం, వాతావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ఎంత ముఖ్యమో తెలియజేయబడుతోంది. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతే శ్రీలతా శోభన్ రెడ్డి



మాట్లాడుతూ, ఈ ఉద్యమం మన సమాజానికి ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ దానిలో భాగస్వాములు కావాలని కోరారు.కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ వేముల శ్రీనివాస్,జి




వెంకటేష్, వి. రావి, ఎస్ అశోక్, తులసిరామ్, వెంకటేష్,మూతయ్య తదితరులు పాల్గొన్నారు.

---

## టాటా కర్వ్ కారును ప్రారంభించిన

# ఉప్పల్ ఎమ్మెల్యే....

### - కుషాయిగూడలో టాటా వెంకటరమణ మోటర్స్‌లో కర్వ్ నూతన కారు విడుదల..



**తెలంగాణవీణ/కాప్రా:** భారతదేశపు ప్రముఖ ఆటోమోటివ్ తయారీదారు అయిన టాటా మోటార్స్ విడుదల చేసిన టాటా కర్వ్ నూతన కారును కుషాయిగూడ టాటా వెంకటరమణ మోటర్స్ లో గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి టాటా కర్వ్ కారులను లాంఛనంగా ప్రారంభించారు. కొత్త మోడల్ కారును ప్రారంబిచడం ఆనందగా ఉందనీ వాహన దారులకు నాణ్యమైన సేవలను అందించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా వెంకటరమణ మోటర్స్ సిఈఓ మహేందర్ మాట్లాడుతూ కుషాయిగూడ పరిసర ప్రాంత ప్రజలకు టాటా కర్వ్ నూతన మాడల్స్ కార్లను అందుబా టులోకి తీసుకొచ్చామ నీ, ఈ కారు విద్యుత్ , పెట్రోల్, డిజిల్ వర్షన్ లతో సరికొత్త ఫీచర్లతో కర్వ్ మోడల్ కార్లు అందుబాటులో ఉన్నాయ న్నారు. ఈ వాహన శ్రేణిలో ఎక్సటీరి యల్, ఇంటిరియల్స్ అదనపు ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. ఈ కారును ఐదు వేరియంట్లలో , ఐదు కలర్లలో వినియోగదారులకు అందు బాటులో ఉన్నాయని తెలిపారు. కాప్రా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, నేమురి మహేష్ గౌడ్, టాటా షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.





---

# ఒకే దేశం.. ఒకే ఎన్నికపై ప్రజల్లో విస్తృత చర్చ జరగాలి

### - బిజేపి జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి



**తెలంగాణ వీణ/తార్నాక:** కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఒకే దేశం ఒకే ఎన్నిక జమిలి ఎన్నికల నిర్ణయం దేశాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ తివారి అన్నారు. ఈ మేరకు గురువారం ఎ సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజక వర్గం తార్నాక విజయపురి కాలనీలో ఆర్కట్ విజయ్కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటికి బిజేపి సభ్యత్వ నమోదులో ఆయన జిల్లా కార్యదర్శి మేకల సారంగపాణితో కలిసి ముఖ్యతిధిగా పాల్గొన్నారు. పలువురి ఇండ్లకు వెళ్లి స్వయంగా డిజిటల్ సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ తివారి మాట్లాడుతూ జమిలీ ఎన్నికలపై ప్రజల్లో పెద్ద ఎత్తున చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. దీని ద్వారా దేశంలోని ప్రజలందరికి మేలు జరుగాలన్నారు. ఒకే ఎన్నిక ద్వారా దేశంలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీంతో పాటుగా సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. అభివృద్ధి శరవేంగంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఒక వైపు ప్రపంచంలోనే భారతదేశన్ని నెంబర్ వన్ దేశంగా నిలబెట్టేందుకు ప్రధాని నరేంద్రమోఢీ చేస్తున్న కృషికి దేశ ప్రజలంతా తోడ్పాటును అందించాలనీ కోరారు. ప్రతి ఒక్కరూ బిజేపి సభ్వత్వం స్వీకరించి దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఈ సభ్యత్వ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలనీ సూచించారు. బిజేపి నాయకులు కనకట్ల హరి, జయశ్రీ,శారదా మల్లేష్, మహేశ్, రాజేష్, శ్రీనివాస్, కుమార్, సతీష్, నాగేందర్, ప్రతాప్, కృష్ణ, తేజ తదితరులున్నారు.



---

## ప్రశాంత వాతావరణంలో గణేశ్ నిమజ్జనం, మిలాద్-ఉన్-నబీ: రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు

### - అన్ని విభాగాల అధికారులు సిబ్బంది అవిశ్రాంత కృషి ప్రశంసనీయం

**తెలంగాణ వీణ/మల్కాజ్గిరి:** గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ముగిశాయని చక్కటి సమన్వయంతో పనిచేసి, నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి చేసిన అన్ని విభాగాల అధికారులు, నిర్వాహకులు సిబ్బందిని రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ సీసీటీవీల ఏర్పాటు ద్వారా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షిస్తూ అందుకు అనుగుణంగా సిబ్బంది పనిచేయడానికి అవసరమైన సాంకేతికపరమైన తోడ్పాటు అందించిన ఐటీ సెల్ సిబ్బందిని కమిషనర్ ప్రశంసించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు సజావుగా సాగేలా తగిన బందోబస్తు ఏర్పాట్లతో పాటు అన్నిరకాల చర్యలు తీసుకోవడం వల్లే సామరస్య వాతావరణంలో వేడుకలు జరిగాయని కమిషనర్ పేర్కొన్నారు. నిమజ్జనం జరిగే చెరువులు, కుంటల వద్ద క్రేన్లు, బారికేడ్లు, మంచినీటి వసతి, గజ ఈతగాళ్లు, లైటింగ్ వంటి సౌకర్యాలు కల్పించామని, నిమజ్జనంకు సంబంధించిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు పలు దఫాలుగా నిర్వహించామని, కట్టుదిట్టమైన భద్రత చర్యలతో నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించామని కమిషనర్ తెలిపారు. వేడుకల ప్రారంభం నుండి నిమజ్జనం ప్రక్రియ ముగిసే వరకూ అన్ని విభాగాల అధికారులు , సిబ్బంది అవిశ్రాంతంగా, క్రమశిక్షణతో, అప్రమత్తంగా విధులు నిర్వర్తించడం వల్లే నిమజ్జనం కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని కమిషనర్ పేర్కొన్నారు. వివిధ గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వహకులతో సమన్వయ సమావేశాలు నిర్వహించామని, వారి సహకారం కూడా అభినందనీయమని పేర్కొన్నారు. అదే విధంగా ముస్లింలు పవిత్రంగా జరుపుకునే మిలాద్-ఉన్-నబీ వేడుకలు కూడా ప్రశాంతంగా జరిగాయని, గణేశ్ నవరాత్రి వేడుకలు, మిలాద్-ఉన్-నబీ పర్వదినం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్నేహపూర్వక వాతావరణంలో జరగడం రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజల మధ్య ఉన్న సామరస్య వాతావరణానికి ప్రతీక అని కమీషనర్ ప్రత్యేకంగా పేర్కొంటున్నారు.



---

## కార్తీక మాసంలో ఆది హిందూ సమ్మేళనం ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్




**తెలంగాణ వీణ/తార్నాక:**కార్తీక మాసం లో ద్రావిడ దార్మిక పరిషత్ ఆధ్వర్యంలో ఆది హిందూ సమ్మేళనం నిర్వహించడం జరుగుతుందని కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ అన్నారు తన 54 వ పుట్టినరోజును ఉస్మానియా లా స్కాలర్స్ మరియు వివిధ సంఘాలు ఘనంగా తన కార్యాలయంలో జరిపారు. ఆయన మాట్లాడుతూ విదేశీ ఆర్య సంతతికి చెందిన ఇండియా ఎన్ డి ఏ కుటములు 78 సవ త్సరాలుగా స్వదేశి ద్రావిద్యులను పరిపాలిన్నారని వారి నుండి అధికారాన్ని సాధించడమే ద్రావిడా ధార్మిక పరిషత్ లక్యం అని ఆయన అన్నారు.

## పరమత సహనానికి ప్రతీకలు పండుగలు: బండి రమేష్





**తెలంగాణవీణ/కూకట్ పల్లి:** మిలాద్ ఉన్ నబి పండుగను పురస్కరించుకొని, ముస్లిమ్ సోదరులు సేవా కార్యక్రమాలు కొనసాగించారు, ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్ పరిధిలోని పెద్ద మసీదు నుండి, గురువారం మత పెద్దలు జులూస్ నిర్వహించారు, అనంతరం వాటర్ బాటిల్స్ జ్యూస్ పంపిణీ చేశారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ మరియు ఏసిపి ఎల్ రాములు పాల్గొన్నారు, ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు, పండుగలు పరమత సహనానికి ప్రతీకలుగా నిలవాలని, ఈ సందర్భంగా బండి రమేష్ పేర్కొన్నారు,ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, అస్లాం, అంజద్ ,అశోక్, ఆన్సర్, కుదుస్‌లు పాల్గొన్నారు.


## దినకర్ నగర్‌లో 30 మీటర్ల సిసి రోడ్ ప్యాచ్ పనులు పరిశీలన



**తెలంగాణ వీణ/మల్కాజిగిరి:** దినకర్ నగర్ ఆర్ యు బి నుండి సిసి రోడ్ 30 మీటర్స్ ప్యాచ్ పనులను కార్పొరేటర్ శ్రావణ్ ఈఈ లక్ష్మణ్, ఏఈ దీపక్ పరిశీలించారు. అనంతరం ఇంజనీరింగ్ అధికారులతో పెండింగ్లో ఉన్న వర్కుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షం పడిన ప్రతిసారి నీళ్ల నిలిచిపోవడంతో అనేకమార్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఎటువంటి చర్యలు లేకపోవడంతో స్థానికులు మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రావణ్ దృష్టికి తెచ్చారు.

## గణనాథుడికి ప్రత్యేక పూజలు

**తెలంగాణ వీణ/మల్కాజిగిరి:** మహాగణపతి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ కోడలు లక్ష్మితా నితిన్ పేర్కొన్నారు. గణేష్ నిమజ్జనం ఉత్సవాలలో భాగంగా రామకృష్ణాపురంలోని టెలిఫోన్ కాలనీలో టీం ట్రై యాంగిల్ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహాగణపతి నిమజ్జన ఊరేగింపులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యూత్ అసోసియేషన్ సభ్యులు ఆమెను శాలువాలతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. సౌమిత్ రెడ్డి, మాధవి కృష్ణ, మోహిత్ కృష్ణ,అరవింద్ రెడ్డి, కాసుల వికాస్, నగేష్,ఠాగూర్ ప్రదీప్ సింగ్, నర్సింగ్ రావు, మల్లేష్ యాదవ్, జయంతి పాల్గొన్నారు.



# పైప్ లైన్ లీకేజి పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలి: కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు





**తెలంగాణవీణ/హైదర్ నగర్:** హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని, హైదర్ నగర్ లో నెలకొన్న మంజీర ప్రధాన పైప్ లైన్ లీకేజీ సమస్యను వాటర్ బోర్డు, జిహెచ్ఎంసిఅధికారులతో మరియు కాలనీ వాసులతో కలసి పరిశీలించిన హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు ,ఈ సందర్భంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు మాట్లాడుతూ, హైదర్ నగర్ లో నెలకొన్న మంజీర ప్రధాన పైప్ లైన్ లీకేజీ సమస్యను, వాటర్ బోర్డు, జిహెచ్ఎంసి అధికారులతో మరియు కాలనీ వాసులతో కలసి పరిశీలించడం జరిగిందని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా త్వరితగతిన మరమత్తు పనులు పూర్తి చేసి నీటి సరఫరా కి ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. ఇంకా ఎక్కడైనా లీకేజ్ అయ్యే పరిస్థితి ఉన్న పైప్ లైన్ లను గుర్తించి, లీకేజీ మళ్ళీ సంభవించకుండా వాటిని కూడా సరిచేయాలని సూచించారు. డివిజన్ లో ఎక్కడ నీటి సమస్య తలెత్తకుండా కిందిస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని అధికారులకు కార్పొరెటర్ నార్నె శ్రీనివాస రావు సూచించారు. అదేవిధంగా ప్రతి కాలనీ, బస్తీలలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తానని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని. మీ కాలనీ లలో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా నన్ను కానీ, కార్పోరేటర్ కార్యాలయంలో కానీ సంప్రదించాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అధికారులు డీజీఎం లు భాస్కర్, నాగ ప్రియ, మేనేజర్ ప్రశాంతి, డీఈ రమేష్, ఏఈ రాజీవ్, వర్క్ ఇన్స్పెక్టర్ మహాదేవ్, మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాల వారిగా వర్గీకరణ చేయాలి: ఏ చంద్రశేఖర్..





**తెలంగాణవీణ/హైదరాబాద్:** ఎస్సీ వర్గీకరణ జిల్లాల వారీగా చేయాలి అని మాజీ మంత్రివర్యులు ఏ చంద్రశేఖర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఉమ్మడి 10 జిల్లాలలో చేపట్టిన మాదిగల మేలుకొలుపు యాత్ర ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ మంత్రివర్యులు ఏ చంద్రశేఖర్ గారు జండా ఊపి మాదిగల మేలుకొలుపు వ్రతాన్ని డాక్టర్ పిడమర్తి రవి గారి ఆధ్వర్యంలో మాదిగ సంఘాల వికాస ఆధ్వర్యంలో ఉమ్మడి పది జిల్లాల్లో ప్రస్తుతం 33 జిల్లాలలో ఈ యాత్ర ఉంటుందని ఈ కార్యక్రమనికి దళిత బహుజన సమితి రాష్ట్ర అధ్యక్షులు మల్లికార్జున్ సభాదీక్షత వహించరు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ మంత్రివర్యులు చంద్రశేఖర్ మాట్లాడుతూ మాదిగల జనాభా నిష్పత్తి ప్రకారం వారి జనాభా ఎంత ఉంటే అంత రిజర్వేషన్ కల్పించాలని కొన్ని జిల్లాలలో మాదిగలు అధికంగా ఉన్నారని అన్నారు. ఎస్సీ వర్గీకరణ తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేయడం అర్సనీయమని ఈ కమిటీ మాదిగ జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని ఎస్సీ వర్గీకరణ కమిటీ విజ్ఞప్తి చేశారు. ఈరోజు మాదిగల మేలుకొలుపు యాత్రలో భాగంగా సంగారెడ్డి పట్టణానికి చేరుకున్న యాత్ర ను ఉద్దేశించి పిడమర్తి రవి గారు మాట్లాడారు. 30 సంవత్సరాల క్రితం పెట్టిన ఈ ఏడు శాతం డిమాండు ఇప్పుడు అమలు చేస్తే మాదిగలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పెరిగిన జనాభాకు అనుగుణంగా వర్గీకరణ చేయాలని జిల్లాలవారీగా వర్గీకరణ చేపట్టే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు అన్ని జిల్లాల కేంద్రంలో మాదిగల మేలుకొలుపు యాత్ర ఉంటుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని పెద్ద కులాలకు రాష్ట్ర ప్రభుత్వంలో ప్రాతినిథ్యం తక్కువగా ఉందని మాదిగలు, లంబాడీలు, మాలలకు, ముదిరాజులకు మంత్రి పదవి ఇవ్వాలని అన్నారు. మాదిగ ఐక్య కూటమి ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల మేలుకొలుపు యాత్రలో భాగంగా ఈరోజు రాత్రి జిల్లా చేరుకుంటుందని ఈనెల 30న బోనగిరిలో ముగింపు సభ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మల్లికార్జున్ సతీష్ మాదిగ బచ్చలకూర బాలరాజు, బిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, మాదిగ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి మోదుగు జోగారావు, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జేర్రిపోతుల సాయన్న మాదిగ, మాదిగ జేఏసీ ఓయూ అధ్యక్షులు జోగు గణేష్, కళాకారులు మాదిగ పిడమర్తి రాంబాబు, గద్దల రమేష్, వజిత్, గణేష్ కథ నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ కోలన్ రాజశేఖర్ రెడ్డి లు పాల్గొన్నారు.

# రాచకొండ పోలీస్ కమిషనరేట్ జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ కొండా విజయ్ కుమార్‌కు డాక్టరేట్

## - అభినందించిన రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు

తెలంగాణ వీణ/మల్కాజ్గిరి: రాచకొండ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ గా పని చేస్తున్న కొండా విజయ్ కుమార్ ఉస్మానియా యూనివర్సిటీ తెలుగుశాఖలో తూర్పు మల్లారెడ్డి పర్యవేక్షణలో తెలంగాణ సాయుధ పోరాటంలో నల్లగొండ కవుల పాత్ర అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ సాధించిన సందర్భంగా రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు నేరేడ్మెట్‌లోని తన కార్యాలయంలో గురువారం అభినందించారు. విజయ్ కుమార్ సూర్యాపేట జిల్లాలోని చిలుకూరు మండలం నారాయణపురం గ్రామంలో కొండా కాశయ్య అంజమ్మ దంపతులకు జన్మించాడు. ఈ సందర్భంగా కమిషనర్ గారు మాట్లాడుతూ, ఓ పక్క ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే డాక్టరేట్ సాధించడం గొప్ప విషయం అని హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగం చేస్తూ కూడా పరిశోధన మీద మక్కువతో డాక్టరేట్ సాధించడం తోటి ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలుస్తుందని, భవిష్యత్తులో నూతన అంశాల మీద పరిశోధన సాగించి మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ జ్ఞానవంతులై దేశ అభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీమతి సుగుణ మరియు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ అశోక రెడ్డి, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు భద్రారెడ్డి , ఇతర ఉద్యోగులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



# డోర్ టు డోర్ బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం



**తెలంగాణ వీణ/మల్కాజిగిరి:** మల్కాజ్‌గిరి డివిజన్ లోని బూత్ నెం.132లో డోర్ టు డోర్ సభ్యత్వ నమోదు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, మల్కాజిగిరి కార్పొరేటర్ ,ఊరపల్లి శ్రవణ్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీ డీ ఎన్ .వెంకటేష్ , ,సీనియర్ నాయకు లు విఠోభ,శ్రీ మంగేష్, రామకృష్ణ , శ్రీ పవన్ డివిజన్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు.



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం గురువారం రోజు శ్రీస్వామి వారికి భక్తులు కానుకల వివరాల రూపంలో గురువారం రోజు వచ్చిన ఆదాయము రూ:16,87,314 /- అని ఆలయ ఈఓ భాస్కర్ రావు తెలిపారు.

- తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:

# వాణిజ్య సముదాయాన్ని ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య





**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** ది నాగార్జున రైతు సేవ సంఘం లిమిటిటెడ్ మోత్కూరు వాణిజ్య సముదాయన్నీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, తుంగతుర్తి ఎమ్మెల్యే ముందుల సామేల్.ప్రారంభించారు.హాజరైన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కి మోత్కూరు పి ఎస్ సి ఎస్, చైర్మన్ ,డైరెక్టర్లు ,రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున్న స్వాగతం పలికారు.



ఎస్సి వసతి గృహంలో విద్యార్థులకు పరుపులను,దుప్పట్లను బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. - తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:

# పేద విద్యార్థులకు బీర్ల ఫౌండేషన్ చేయూత



**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** మోటకొండూరు మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో(హాస్టల్),యాదగిగుట్ట పట్టణంలోని బాలికల వసతి గృహంలో,ఆలేరు పట్టణంలోని ఎస్సి బాలికల పాటశాల లో, విద్యార్థినిలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో బీర్ల ఫౌండేషన్ ద్వారా బెడ్స్ ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీ,విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య బీర్ల ఫౌండేషన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

G9 TV తెలుగు
తెలంగాణ వీణ
తెలుగు దినపత్రిక
For Advertisements
8328209811
Flat No 204,
Mythri Appartments,
Opp BSNL Office, ECIL







## భారత బ్యాటర్లను బెంబేలెత్తించాడు



చెన్నై వేదికగా టీమిండియాతో జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ పేసర్ హసన్ మహమూద్ నిప్పులు చేరుగుతున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో తన పేస్ బౌలింగ్‌తో భారత బ్యాటర్లను బెంబేలెత్తిస్తున్నాడు. లంచ్ విరామానికి ముందు అతడిని ఆపడం ఎవరి తరం కాలేదు. భీకరమైన బౌన్సర్లతో టీమిండియా ఆటగాళ్లను బోల్తా కొట్టించాడు. ఆఖరికి విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్ వంటి స్టార్ ప్లేయర్ల సైతం అతడి బౌలింగ్ ముందు బ్యాట్లెత్తాశారు. అతడి దెబ్బకు 34 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ తర్వాత క్రీజులో నిలదొక్కుకున్న రిషబ్ పంత్‌ను సైతం మహముద్ పెవిలియన్‌కు పంపాడు. ఓవరాల్‌గా తొలి ఇన్నింగ్స్‌లో ఇప్పటివరకు 18 ఓవర్లు బౌలింగ్ చేసిన హసన్.. 58 పరుగులిచ్చి 4 వికెట్లు సాధించాడు. ఈ క్రమంలో భారత్‌ను ఆరంభంలోనే కష్టాల్లో నెట్టిన ఈ యువ పేసర్ గురించి నెటిజన్లు తెగ చర్చించుకుంటున్నారు.24 ఏళ్ల హసన్ మహమూద్ 1999, ఆక్టోబర్ 12న బంగ్లాదేశ్‌లోని లక్ష్మీపూర్‌లో జన్మించాడు. మార్చి 2020లో మహమూద్ జాతీయ జట్టు తరపున అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. స్వదేశంలో జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌తో మహమూద్ తన ఇంటర్నేషనల్ కెరీర్‌ను ప్రారంభించాడు. ఆ తర్వాత ఏడాదికే వన్డేల్లో వెస్టిండీస్‌పై హసన్ డెబ్యూ చేశాడు. వైట్‌బాల్ క్రికెట్‌లో సత్తాచాటడంతో అతడికి బంగ్లా టెస్టు జట్టులో కూడా చోటు దక్కింది. ఈ ఏడాది మొదట్లో శ్రీలంకపై టెస్టు క్రికెట్‌లోకి అతడు అడుగుపెట్టాడు. అ?క్కడ కూడా మహమూద్ అదరగొట్టాడు. కాగా హసన్‌కు ఇది నాలుగో టెస్టు. ఇంతకుముందు కేవలం మూడు టెస్టులు మాత్రమే ఆడిన హసన్..13 వికెట్లు పడగొట్టాడు. అంతేకాకుండా ఈ మూడు మ్యాచ్‌ల్లో హసన్ 4 కంటే తక్కువ ఎకానమీ రేటును కలిగి ఉండడం గమనార్హం. ఈ మ్యాచ్ కంటే ముందు పాకిస్తాన్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో కూడా హసన్ దుమ్ములేపాడు. పాక్‌తో జరిగిన రెండో టెస్టులో ఐదు వికెట్లు పడగొట్టి సత్తాచాటాడు. పాక్‌పై బంగ్లాదేశ్ చారిత్రత్మక టెస్టు సిరీస్ విజయం సాధించడంలో హసన్‌ది కీలక పాత్ర. కొత్త బంతితో రెండు వైపులా స్వింగ్ చేయగలిగే సత్తా అతడికి ఉంది. మొత్తంగా ఈ మ్యాచ్‌తో కలపునకుని అతడి ఖాతాలో 17 టెస్టు వికెట్లు ఉన్నాయి. అదే విధంగా వన్డేల్లో 30, టీ20ల్లో 18 వికెట్లు హసన్ పేరిట ఉన్నాయి.

## బంగ్లా ప్లేయర్‌పై పంత్ ఆగ్రహం!

అందరూ ఊహించినట్లుగానే జరుగుతోంది. ఇటీవల పాకిస్థాన్‌ను దాని సొంతగడ్డపై చిత్తు చేసిన బంగ్లాదేశ్.. అదే ఊపులో భారత్‌నూ దెబ్బ కొడుతోంది. భారత టాప్ ఆర్డర్‌కు బంగ్లా పేసర్ హసన్ మహ్మద్ చుక్కలు చూపించాడు. హసన్ దెబ్బకు స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ (6), శుభ్‌మన్ గిల్ (0), విరాట్ కోహ్లీ (6) త్వక్కువ పరుగులకే పెవిలియన్‌కు చేరారు. ఆ సమయంలో రిషబ్ పంత్ (39)తో కలిసి యశస్వి జైస్వాల్ (56) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 62 పరుగులు జోడించారు. లంచ్ బ్రేక్ అనంతరం కాసేపటికే హసన్ మహ్మద్ బౌలింగ్‌లో రిషబ్ పంత్ అవుట్ అయ్యాడు. అయితే అంతకుముందు పరుగు తీస్తున్న క్రమంలో బంగ్లా ప్లేయర్ లిటన్ దాస్‌పై పంత్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. భారత ఇన్నింగ్స్‌లో 16వ ఓవర్‌ను తస్కిన్ అహ్మద్ వేశాడు. మూడో బంతికి షాట్ ఆడిన యశస్వి జైస్వాల్.. సింగిల్ కోసం పరుగెత్తాడు. సమయంలో ఫీల్డర్ విసిరిన బంతి స్ట్రైకింగ్ వైపు దూసుకొస్తున్న పంత్ ప్యాడ్లను బలంగా తాకింది. మరో పరుగు కోసం ప్రయత్నించి ఆగిపోయిన పంత్.. లిటన్ దాస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'నన్నెందుకు కొడుతున్నారు' అంటూ పంత్ అతడితో అన్నాడు. ఈ వ్యాఖ్యలు అక్కడి స్టంప్స్ మైక్స్‌లో రికార్డు అయ్యాయి. లిటన్ దాస్ ఏదో అంటూ తన పొజిషన్‌కు వెళ్లిపోయాడు. తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 144 పరుగులకే



6 వికెట్స్ కోల్పోయింది. ప్రస్తుతం భారత్ స్కోరు 48 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. క్రీజులో రవీంద్ర జడేజా (7), రవిచంద్రన్ అశ్విన్ (21) ఉన్నారు. యశస్వి జైస్వాల్ హాఫ్ సెంచరీ (56) చేయగా.. రిషబ్ పంత్ (39) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కేఎల్ రాహుల్ (16) తక్కువ స్కోరుకే అవుట్ అయ్యాడు. హసన్ మహ్మద్ నాలుగు వికెట్స్ పడగొట్టాడు.

## చరిత్ర సృష్టించిన జైస్వాల్

చెపాక్ వేదికగా భారత్-బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న తొలి టెస్టు ఆసక్తికరంగా సాగుతోంది. ఊహించనట్లుగానే పాకిస్తాన్‌ను ఓడించిన కొత్త ఉత్సాహంతో బంగ్లాదేశ్ బరిలోకి దిగి నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకుంటుంది. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో మొదటి రోజు ఆటలో తొలి రెండు సెషన్లలో భారత్‌పై బంగ్లా పైచేయి సాధించింది. టీ విరామానికి టీమిండియా 48 ఓవర్లకు ఆరు వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. క్రీజులో రవిచంద్రన్ అశ్విన్ (21 నాటౌట్), రవీంద్ర జడేజా (7) ఉన్నారు. మొదటి ,రెండు సెషన్లలో భారత్ సరిగ్గా 88 పరుగులు చేసి మూడు వికెట్లు కోల్పోయింది. అయితే బంగ్లాదేశ్‌కు భారత్ ఈ మాత్రం అయినా పోటీ ఇస్తుందంటే అది యశస్వీ జైస్వాల్ అర్ధశతక (56బీ 118 బంతుల్లో, 9 ఫోర్లు) పోరాటమే. టాస్ ఓడి బ్యాటింగ్‌కు వచ్చిన టీమిండియా పది ఓవర్లలోపే మూడు వికెట్లు కోల్పోయింది. హసన్ మహ్మద్ నిప్పులు చెరిగే బంతులకు కెప్టెన్ రోహిత్ శర్మ (6బీ 19 బంతుల్లో, 1 ఫోర్), శుభ్‌మన్ గిల్ (డకౌట్), విరాట్ కోహ్లి (6బీ 6 బంతుల్లో) వరుసగా పెవిలియన్‌కు చేరారు. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన పంత్ (39బీ 52 బంతుల్లో, 6 ఫోర్లు)తో కలిసి జైస్వాల్ ఇన్నింగ్స్ చక్కదిద్దాడు. నాలుగో వికెట్‌కు పంత్‌తో కలిసి 62 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. లంచ్ విరామం తర్వాత పంత్ ఔటైనప్పటికీ కేఎల్ రాహుల్ (16బీ 52 బంతుల్లో, 1 ఫోర్)తో కలిసి జైస్వాల్ స్కోరుబోర్డు ముందుకు నడిపించాడు. నిలకడగా ఆడుతూ అర్ధశతకం సాధించాడు. టెస్టు ఫార్మాట్‌లో ఆడిన 17 ఇన్నింగ్స్‌ల్లో జైస్వాల్‌కు ఇది ఐదో హాఫ్ సెంచరీ. మూడు శతకాలు కూడా సాధించాడు. అయితే ఈ క్రమంలో జైస్వాల్ అరుదైన రికార్డు సాధించాడు. ఈ ఏడాది క్యాలెండ్ ఇయర్‌లో టెస్టుల్లో అత్యధిక పరుగులు సాధించిన రెండో ప్లేయర్‌గా చరిత్రకెక్కాడు.బంగ్లాతో తొలి టెస్టు ప్రారంభానికి ముందు నాలుగో స్థానంలో ఉన్న జైస్వాల్ ఇద్దరిని అధిగమించి రెండో స్థానానికి ఎగబాకాడు. అగ్రస్థానంలో జో రూట్ (20 ఇన్నింగ్స్‌ల్లో- 986 పరుగులు) ఉన్నాడు. ఆ తర్వాతి స్థానాల్లో యశస్వీ జైస్వాల్ (12 ఇన్నింగ్స్‌ల్లో- 796 పరుగులు), కామిందు మెండిస్ (10 ఇన్నింగ్స్‌ల్లో- 748 పరుగులు), ఒలీ పోప్ (11 ఇన్నింగ్స్‌ల్లో- 745 పరుగులు) ఉన్నారు. జైస్వాల్ ఇదే జోరు కొనసాగిస్తే రూట్ స్కోరు అధిగమించడం ఖాయమే. బంగ్లాతో రెండు, న్యూజిలాండ్‌తో మూడు టెస్టులతోబీ ఆస్ట్రేలియాతో జరిగే అయిదు టెస్టుల సిరీస్‌లో నాలుగు టెస్టులను భారత్ ఈ ఏడాదే ఆడనుంది. ఈ మ్యాచ్‌ల్లో జైస్వాల్ టాపర్‌గా నిలవడం ఖాయమే!



## డకౌట్లలోనూ శుభ్‌మన్ గిల్ రికార్డులే!

చెపాక్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో టీమిండియా యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ డకౌటయ్యాడు. ఎనిమిది బంతులు ఎదుర్కొని ఖాతా తెరవకుముందే పెవిలియన్‌కు చేరాడు. హసన్ మహ్మద్ లెగ్ సైడ్ దిశగా వేసిన బంతిని వెంటాడి వికెట్ కీపర్ లిటన్ దాస్ చేతికి చిక్కాడు. అనంతరం నిరాశగా మైదానాన్ని వీడాడు. అయితే డకౌటైన గిల్ కోరుకోని రికార్డుల జాబితాలో చోటు దక్కించుకున్నాడు. ఓ క్యాలెండెర్ ఇయర్‌లో సొంతగడ్డపై మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు డకౌటైన భారత ఆటగాళ్ల జాబితాలో గిల్ చేరాడు. గిల్ ఈ ఏడాది ఇప్పటికి మూడు సార్లు డకౌటయ్యాడు. ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో గిల్ హైదరాబాద్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో, రాజ్‌కోట్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో పరుగుల ఖాతా తెరవకముందే పెవిలియన్‌కు చేరాడు. కాగా, ఈ జాబితాలో అగ్రస్థానంలో మొహిందర్ అమర్‌నాథ్ ఉన్నాడు. 1983లో ఆయన ఏకంగా అయిదు సార్లు డకౌటయ్యాడు. ఇక తర్వాతి స్థానాల్లో మన్సూర్ అలీ ఖాన్ పటౌడి (1969), దిలీప్ వెంగసర్కార్ (1979), వినోద్ కాంబ్లి (1994), విరాట్ కోహ్లి (2021), శుభ్‌మన్ గిల్ (2024) ఉన్నారు. వీరందరూ ఓ క్యాలెండర్ ఇయర్‌లో మూడు సార్లు డకౌయ్యాడు. అయితే గత కొన్నాళ్లుగా గిల్ పేలవ ప్రదర్శన టీమిండియా అభిమానులను కలవరపెడుతోంది. బంగ్లాదేశ్ సిరీస్‌తో అయినా గిల్ పుంజుకుంటాడనుకుంటే నిరాశే మిగిలింది. పైగా డకౌట్లలో రికార్డు కూడా సాధించాడు. దీంతో గిల్‌పై నెట్టింట్లో ట్రోల్స్ వస్తున్నాయి. ప్రిన్స్ మామూలోడు కాదని, డకౌట్లలోనూ రికార్డులే అంటూ వ్యంగ్యంగా కామెంట్లు చేస్తున్నారు. గిల్‌ను క్రికెట్ అభిమానులు ప్రిన్స్‌గా అభివర్ణిస్తారు. ఇక మ్యాచ్ విషయానికొస్తే.. తొలి రోజు ఆటలో 66.1 ఓవర్లకు భారత్ 270/6 స్కోరు చేసింది. రవిచంద్రన్ అశ్విన్ (77బి), రవీంద్ర జడేజా (48బి) క్రీజులో ఉన్నారు. యశస్వీ జైస్వాల్ (56బీ 118 బంతుల్లో, 9 ఫోర్లు) అర్ధశతకంతో రాణించాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (6బీ 19 బంతుల్లో, 1 ఫోర్), శుభ్‌మన్ గిల్ (డకౌట్), విరాట్ కోహ్లి (6బీ 6 బంతుల్లో), కేఎల్ రాహుల్ (16బీ 52 బంతుల్లో, 1 ఫోర్) విఫలమయ్యారు. పంత్ (39బీ 52 బంతుల్లో, 6 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. హసన్ అహ్మద్ నాలుగు వికెట్లు తీశాడు.



## సొంత గ్రౌండ్‌లో రెచ్చిపోయిన అశ్విన్!

బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో టీమిండియా అద్భుతంగా పుంజుకుంది. గురువారం చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా ప్రారంభమైన తొలి టెస్ట్‌లో.. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు బంగ్లా బౌలర్ హసన్ మహమూద్ ఊహించని షాకిచ్చాడు. రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీని వెంటవెంటనే అవుట్ చేశాడు. 34 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి.. కష్టాల్లో పడిన టీమిండియాను యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్ జోడీ కాస్త ఆదుకుంది. లంచ్ బ్రేక్‌కు మరో వికెట్ పడకుండా 88 పరుగులు చేశారు. లంచ్ తర్వాత మళ్లీ వికెట్ల పడ్డాయి. జైస్వాల్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొని అవుట్ అయ్యాడు. మొత్తంగా టీమిండియా 144 పరుగుల వద్ద 6వ వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత.. జడేజాతో జత కలిసి రవిచంద్రన్ అశ్విన్.. తన సొంత గ్రౌండ్‌లో రెచ్చిపోయాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లాంటి దిగ్గజ బ్యాటర్లు విఫలమైన పిచ్‌పై ఎలా బ్యాటింగ్ చేయాలో చూపిస్తూ.. ఊర మాస్ ఇన్నింగ్స్ ఆడాడు. ఇది టెస్ట్ మ్యాచ్ అనే విషయం మర్చిపోయాడు, వికెట్లు పడిపోయానే భయం? లేకుండా.. ప్రాపర్ వన్డే ఇన్నింగ్స్‌తో బాల్ టూ బాల్ ఇన్నింగ్స్‌తో టీమిండియాను ఆదుకున్నాడు. మొత్తంగా 108 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 10 ఫోర్లు, 2 సిక్సులతో సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. అశ్విన్‌కు రవీంద్ర జడేజా కూడా సూపర్ బ్యాటింగ్‌తో మంచి సపోర్ట్ అందించాడు. అశ్విన్ సూపర్ డూపర్ ఇన్నింగ్స్‌కు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఫిదా అయిపోయాడు. అశ్విన్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న సమయంలో.. డ్రెస్సింగ్ రూమ్‌లో నిల్చోని మరి చప్పట్లు కొడుతూ అశ్విన్‌ను అభినందించారు. స్టార్ బ్యాటర్లు బ్యాటర్లు పరుగులు చేయలేకపోయినా పిచ్‌పై, బంగ్లా బౌలింగ్‌ను చెడుగుడు ఆడుకుంటూ.. అశ్విన్ చేసిన సూపర్ బ్యాటింగ్ ఇప్పుడు టాక్ ఆఫ్ ది క్రికెట్ టౌన్‌గా నిలిచింది.



GS9TV తెలుగు
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
అతి కొద్ది కాలంలోనే ప్రజలకు ప్రజాప్రతినిధులకూ వారధి గా ప్రదర్శింపబడుతున్న
GS9TV కేబుల్ ఛానల్, తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు
అన్ని జిల్లాల నుండి విలేకరులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు
8328209811
9703024024

# బయటకు వచ్చిన స్వయంభు వర్కింగ్ స్టిల్




టాలీవుడ్ యాక్టర్ నిఖిల్ సిద్దార్థ నటిస్తోన్న తాజా చిత్రం స్వయంభు. నిఖిల్ తొలి పాన్ ఇండియా సినిమాగా వస్తోన్న 20లో మలయాళ బ్యూటీ సంయుక్తామీనన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కేజీఎఫ్ చిత్రానికి అదిరిపోయే బీజీఎం అందించిన రవిబస్రూర్ స్వయంభు చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ అని తెలిసిందే. కాగా చాలా రోజుల తర్వాత స్వయంభు అప్‌డేట్ స్టిల్ రూపంలో బయటకు వచ్చింది. ప్రస్తుతం స్వయంభు మ్యూజిక్ సెషన్స్ కొనసాగుతున్నాయి. రవి బస్రూర్ పాటల రికార్డింగ్ సెషన్‌లో ఉన్నాడు. సరస్వతీ పుత్ర రామజోగయ్య శాస్త్రి, డైరెక్టర్ భరత్ కృష్ణమాచారి, రవి బస్రూర్ కలిసి ఉన్న స్టిల్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఇప్పటికే కార్తికేయ ఫ్రాంఛైజీతో నార్త్‌లో మంచి ఫేం సంపాదించిన నిఖిల్‌కు రవిబస్రూర్ బాణీలు మరింత ఇమేజ్‌ను తెచ్చిపెట్టే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయంటున్నారు సినీ జనాలు. ఈ చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నాడు. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. స్వయంభులో నిఖిల్ యుద్ధ వీరుడిగా ఇదివరకెన్నడూ కనిపించని సర్‌ప్రైజింగ్ లుక్‌లో మెరువబోతున్నట్టు ఇప్పటివరు విడుదల చేసిన పోస్టర్లు చెబుతున్నాయి.

# మరిన్ని చిక్కుల్లో కంగనా రనౌత్

సిక్కుల ప్రతిష్ఠ దిగజార్చే ప్రయత్నం చేశారంటూ చండీగఢ్ లోని జిల్లా కోర్టులో పిటిషన్

తాను సొంతంగా తెరకెక్కించిన వివాదాస్పద చిత్రం 'ఎమర్జెన్సీ'తో బాలీవుడ్ ఫైర్ బ్రాండ్, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చిక్కుల్లో పడింది. తాజాగా ఆమెకు ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. చండీగఢ్ లోని ఓ జిల్లా కోర్టు కంగనకు నోటీసులు జారీ చేసింది. జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, న్యాయవాది రవీందర్ సింగ్ బస్సి ఆమెపై కోర్టులో పిటిషన్ వేశారు. 'ఎమర్జెన్సీ' సినిమాలో సిక్కుల ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నం కంగన చేసిందని తన పిటిషన్ లో రవీందర్ సింగ్ ఆరోపించారు. సిక్కులను కించపరిచేలా చూపించడమే కాకుండా, సిక్కు సామాజికవర్గంపై పలు అసత్య ఆరోపణలు చేశారని... ఆమెపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో కంగనకు కోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 5వ తేదీకి వాయిదా వేసింది. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జీవితం, ఎమర్జెన్సీ ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. ఈ చిత్రానికి కంగన దర్శకత్వం వహించారు. వాస్తవానికి సెప్టెంబర్ 6న ఈ చిత్రం విడుదల కావాల్సి ఉంది. ఇప్పటికే సినిమా ట్రైలర్ కూడా విడుదలయింది. అయితే, ఈ చిత్రాన్ని నిషేధించాలని కోరుతూ హర్యానా హైకోర్టులో పిటిషన్ దాఖలయింది. వివాదాస్పద సన్నివేశాలను తొలగించిన తర్వాతే సినిమాను విడుదల చేయాలని పిటిషన్ లో కోరారు. ఈ సినిమాకు ఇంకా సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో... విడుదలను వాయిదా వేశారు. సెన్సార్ క్లియరెన్స్ వచ్చిన తర్వాత కొత్త విడుదల తేదీని మేకర్స్ ప్రకటించనున్నారు.

# ఆలోచించి దేవర టైటిల్ ఖరారు చేశాం

## - అసలు విషయం చెప్పిన ఎన్టీఆర్



ఎన్టీఆర్ నటించిన తాజా చిత్రం 'దేవర' కొరటాల శివ దర్శకుడు. సెప్టెంబర్ 27న ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. ఈనేపథ్యంలో ఇటీవల జరిగిన ఓ ప్రెస్‌మీట్‌లో తన చిత్రానికి సంబంధించిన పలు విశేషాలను తారక్ పంచుకున్నారు. సినిమా విడుదల దగ్గరవుతున్న తరుణంలో టెన్షన్‌గా ఉందన్నారు. సినిమాపై నమ్మకంగా ఉన్నానని.. టీమ్ అంతా ఎంతో కష్టపడి వర్క్ చేశామని తెలిపారు. అనిరుధ్ మ్యూజిక్‌ను మెచ్చుకుంటూ.. తన సంగీతంతో అనిరుధ్ అదరగొడుతున్నారు. ప్రస్తుతం ఆయన శకం నడుస్తోంది. విజయం అందుకున్న కొంతకాలానికి వివిధ కారణాల వల్ల చాలామంది విఫలం అవుతారు. కానీ అనిరుధ్ అలా కాదు. ఒక సినిమాకు సంగీతం ఎంత అవసరమో అతనికి బాగా తెలుసు. అతను అద్భుతమైన వ్యక్తి. అనుకున్నవిధంగా రిజల్ట్ వచ్చేవరకూ కష్టపడుతూనే ఉంటాడు. జైలర్, విక్రమ్, మాస్టర్ చిత్రాలకు ఆయన అద్భుతమైన మ్యూజిక్ అందించాడు. ఏఆర్ రెహమాన్ స్థాయికి అనిరుధ్ వెళ్తాడు. అంతర్జాతీయ చిత్రాలకూ కంపోజ్ చేస్తాడని ఎన్టీఆర్ అన్నారు. 'ఆర్ఆర్ఆర్' మాదిరిగా, దేశవ్యాప్తంగా ప్రేక్షకులకు చేరువయ్యే టైటిల్ పెట్టాలనుకున్నామని.. ఆ విధంగా 'దేవర' ఫైనల్ చేశామని చెప్పారు. 'దేవర' అంటే దేవుడు అని అర్థం అన్నారు.

హీరోయిన్‌గా జాన్వీకపూర్ ను తొలుత అనుకోలేదన్నారు. కథ రాస్తున్నప్పుడు కథానాయికగా ఎవరిని ఎంచుకోవాలనే విషయంలో మాకు ఎలాంటి ఆలోచన లేదు. అలాంటి సమయంలో కరణ్ జోహార్ ఒకసారి కాల్ చేసి.. 'జాన్వీ మంచి నటి. ఆమెను మన సినిమాలో తీసుకుంటే బాగుంటుందని చెప్పారు. ఆ తర్వాత కూడా మేము ఆమెను తీసుకోవాలని అనుకోలేదు. కానీ, జాన్వీకపూర్ ఇందులో భాగం కావాలని బలంగా కోరుకున్నారు. స్క్రిప్ట్ రైటింగ్ పూర్తయ్యే సమయానికి ఆమె టీమ్‌లోకి వచ్చారు. యాక్టింగ్, భాష విషయంలో జాన్వీ తొలుత ఎంతో కంగారుపడ్డారు. కానీ, చక్కగా యాక్ట్ చేశారు. ఆమె యాక్టింగ్‌తో షాక్‌కు గురి చేశారని ఆయన తెలిపారు. ఎన్టీఆర్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నారు. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. 'దేవర' రెండు భాగాల్లో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినీప్రియులను ఆకట్టుకున్నాయి. సినిమాపై అంచనాలు పెంచేశాయి.










Published and Printed by Vulloju Srinivas On Behlf of Sri Veena Publications Printed at Telalangana Veena Flat NO: 204 Mythri Apartments, Opp Bsnl Office Ecil,Kapra,Med
Responsibble for Selection of News Under The PRB ACT, Phone Number: 040 35668720, RNI Reg N0: TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written